ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి
5
గురువారం 25 జనవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.119	173	196
సూర్యాపేట	రూ.120	170	200
నల్లగొండ	రూ.119	173	196

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 20.2

ప్రమాద ఘంటికలు



త్రిపురారంలో బీటలు వారిన వరి పొలం

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- గత ఏడాది డిసెంబరులో 7.84మీ., లోతుకు పడిపోయిన నీటిమట్టం
- చందంపేట, నేరడుగొమ్ము, చిట్యాలలో 11మీ., లోతుకు
- సాగర్‌లో 520అడుగుల నీటిమట్టం
- మరో 10అడుగులు తగ్గితే డెడ్ స్టోరేజీ
- తాగునీటి అవసరాలకే సాగర్ నీటి నిల్వలు
- ఆరుతడిపై ఆశలు గల్లంతు
- హైదరాబాద్‌కు తాగునీటికి ప్రత్యామ్నాయ మార్గాలు

తీవ్ర వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటడంతో ఉమ్మడి జిల్లాలో వేసవికి ముందే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రానున్న రోజుల్లో సాగునీటి సంగతి అటుంచితే తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు కాగా, ప్రస్తుతం 520అడుగులుగా ఉంది. మరో 10 అడుగుల నీటి మట్టం తగ్గితే డెడ్ స్టోరేజీకి చేరనుంది. సాగర్ నీటి నిల్వలను తాగునీటి అవసరాల కోసమే ఇకపై విని యోగించనున్నారు.

ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ఏకేబీఆర్(అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నుంచి హైదరాబాద్‌కు ప్రతీ రోజు మూడు మోటార్ల ద్వారా రోజుకు 1,350క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. నల్లగొండ జిల్లాకు ప్రతీ రోజు మిషన్ భగీరథ ద్వారా 45క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. రానున్న రోజుల్లో అంటే నిండు వేసవిలో నీటి ఎద్దడి తీవ్రమయ్యే అవకాశాలు ఉండటంతో పీఏపల్లి మండలం పుట్టంగండి వద్ద అత్యవసర మోటార్లకు మరమ్మతులు చేసే పనిలో అధికారులు ఉన్నారు. సాగర్ 510 అడుగులకు నీటి మట్టానికి పడిపోతే అత్యవసర మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. 506అడుగుల నీటిమట్టం సాగర్‌లో ఉన్నప్పుడు ఈ మోటార్ల ద్వారా నీటి కేటాయింపులు ఉంటాయి. పదేళ్ల క్రితం ఇదే పరిస్థితి ఎదురైంది. సాగర్ ప్రాజెక్టులో జీరో అంటే 450అడుగుల నీటిమట్టం ఉన్నా తాగునీటి అవసరాల కోసం జలాశయానికి ఆనుకొని ఉన్న సుంకిశాల ప్రాంతం నుంచి మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పటికే సాగర్ ఆయకట్టు కింద సాగునీటి శాఖ అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించడంతో ఆరుతడి సాగుపైనా ఆశలు గల్లంతయ్యాయి.

యాసంగిలో సాగుకు తీవ్ర ఇబ్బందులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు లేక ఎడమ కాల్వ కింద నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. గత వానాకాలంతో పాటు యాసంగి సీజన్‌లో ఆయకట్టు రైతులు నాట్లు వేయలేదు. ఏఎమ్మార్పీ, డిండి ప్రాజెక్టుల పరిధిలో సైతం నాట్లు పడలేదు. మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో మాత్రం 32వేల ఎకరాల్లో నాట్లు పడగా, మిగతా రైతులు బోర్లు, బావులు ఆధారంగా నాట్లు వేశారు. అయితే వేసవిలో బోర్లు ఎండినా, కరెంట్ కోతలు విధించినా వరి చేతికి రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బోర్లలో నీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వరి పొట్టదశ వచ్చేసరికి నీరు సరిపోతుందో లేదో అని రైతులు వాపోతున్నారు. యాసంగి సీజన్ గత ఏడాది నవంబరు 15 నుంచి ప్రారంభమైంది. మార్చి లేదా ఏప్రిల్ నాటికి పంట చేతికి రానుంది. వర్షాభావ పరిస్థితుల్లో చెరువులు నిండక భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. సాగర్ ఎడమ కాల్వ కింద 1.80లక్షల ఆయకట్టు ఉండగా, ఈసారి బోరుబావుల కింద ఆయకట్టులో 30వేల ఎకరాలకు మించి వరి సాగుకాలేదు. ఏఎమ్మార్పీ హైలెవల్, లోలెవల్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేవు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 5.86లక్షల ఎకరాలు సాగుకావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2.99లక్షల ఎకరాల్లో మాత్రమే వరితోపాటు ఇతర పంటలు సాగయ్యాయి. వరి 2.73లక్షల ఎకరాల్లో సాగు కాగా, 20వేల ఎకరాల్లో వేరుశనగ, 6వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న, ఆముదం, మినుము, బొబ్బర, పెసర పంటలు సాగయ్యాయి. ఈ నెలాఖరులోగా యాసంగి సీజన్ ముగియనుండగా, మరో 40వేల ఎకరాలకు మించి పంటలు సాగయ్యే పరిస్థితి కానరావడం లేదు.

7.84మీటర్లకు పడిపోయిన భూగర్భ జలాలు

నల్లగొండ జిల్లాలో వానాకాలంలో 651.4మి.మీ సాధారణ వర్షపాతానికి, 530.4మి.మీ వర్షపాతం నమోదైంది. 18.6మి.మీ., లోటువర్షపాతం ఉంది. అత్యధికంగా 14మండలాల్లో లోటు వర్షపాతంగా నమోదైంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు పడిపోగా, మరో రెండు నెలల్లో పరిస్థితి దారుణంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. 2022 ఏడాదితో పోలిస్తే 2023 డిసెంబరు నెలాఖరు వరకు నల్లగొండ జిల్లాలో 7.84మీ., లోతుకు నీటి మట్టాలు పడిపోయాయి. 2022 డిసెంబరులో 4.65మీ., లోతులో జలపాతం ఉండగా, 2023లో 7.84మీ., లోతులో భూగర్భ నీటిమట్టం ఉంది. ఏడాదిలో 3.19మీ., కిందికి నీటిమట్టాలు పడిపోయాయి. చందంపేట, నేరడుగొమ్ము, చిట్యాల మండలాల్లో 11మీ., లోతుకు నీటిమట్టాలు పడిపోయాయి.

నల్లగొండ జిల్లాలో డివిజన్ల వారీగా భూగర్భ జలమట్టం..

డివిజన్	2022 డిసెంబర్‌లో..	2023 డిసెంబర్‌లో..
నల్లగొండ	4.51 మీటర్లు	7.23 మీటర్లు
మిర్యాలగూడ	4.60 మీటర్లు	7.66 మీటర్లు
దేవరకొండ	4.86 మీటర్లు	8.24 మీటర్లు

● ఇంత కరువు ఎన్నడూ చూడలే



20 ఏళ్లుగా ఇంత కరువు ఎన్నడూ చూడలేదు. బోరు బావుల ఆధారంగా కొంతమేర వరి సాగు చేశా. కనీసం ఆరుతడికి నీళ్ల వదులుతారని ఆశతో సాగు చేశాం. కానీ సాగర్ ప్రాజెక్టులో నీళ్ల అడుగంటిపోవడంతో ఆశలు నీరుగారాయి. ఈ యాసంగిలో వేసిన పంట చేతికి వచ్చే అవకాశాలు కనబడటం లేదు. ఆయకట్టు కింద లక్షలాది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.

సయ్యద్, రైతు, త్రిపురారం



పట్టు సాగు తగ్గుతోంది

తగ్గిన దిగుబడి, ధర ● ఐదేళ్లుగా అందని బోనస్

సాగు మానేస్తున్న రైతులు

మోత్కూరు, జనవరి 24: వాతావరణం అనుకూలించక, గిట్టుబాటు ధర లభించక రైతులు ఏ పంట సాగు చేసినా నష్టాలనే చవిచూస్తున్నారు. కొత్త పంట సాగు సమయంలో కొంత ఆశాజనకంగా ఉన్నా, ఆ తరువాత దిగుబడి, ధర తగ్గి నష్టపోతున్నారు. పట్టు పురుగుల పెంపకం కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. పట్టు పురుగుల పెంపకం లాభదాయకంగా ఉంటుందని, షెడ్ నిర్మాణానికి సబ్సిడీ, కిలో పట్టుగూళ్లకు రూ.75 చొప్పున బోనస్ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించింది. ఏడాదికి ఏడెనిమిది పంటలు తీయవచ్చని సెరికల్చర్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో పలువురు రైతులు వరి, పత్తి, కంది లాంటి సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి దశాబ్ద కాలంగా మల్బరీ సాగు (పట్టు పురుగుల పెంపకం) చేపట్టారు. మొదట్లో సాగు లాభదాయకంగానే ఉన్నా, ఇటీవల పురుగులు గూళ్లు కట్టకపోవడం, పట్టు గూళ్ల ధర బాగా పడిపోవడం, ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవడంతో పట్టు రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మోత్కూరు మండలంలో 100ఎకరాల్లో మల్బరీ సాగవుతోంది.

గూళ్లు అల్లని పురుగులు

వారం ఎదిగిన పట్టు పురుగులను తెచ్చి రైతులు షెడ్లలో వేసి మల్బరీ ఆకులను మేతగా ఇస్తారు. మూడు వారాల్లో అవి పట్టుగూళ్లను అల్లుతాయి. గూడు అల్లడం మొదలు పెట్టగానే రైతులు వాటిపై చంద్రికలు పరుస్తారు. నాలుగైదు రోజుల్లో గూళ్ల అల్లిక పూర్తవుతుంది. ఆరో రోజున వాటిని వేరు చేసి, ఏడో రోజున మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. అయితే ఐదారు మాసాలుగా పట్టు పురుగులు గూళ్లు అల్లడం లేదు. గతంలో 100గుడ్ల పురుగులు పెంచితే 85 నుంచి 90కిలోల వరకు దిగుబడి రాగా, ప్రస్తుతం 60 నుంచి 65కిలోలకు పడిపోయింది.

నాణ్యతపై అనుమానాలు

రాష్ట్రంతో పాటు పలు దక్షిణాది రాష్ట్రాల్లో రైతులు మల్బరీ సాగు చేస్తున్నారు. దిగుబడి తగ్గడానికి విత్తన నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పురుగులు గూళ్లు కట్టని విషయాన్ని శాస్త్రవేత్తలు కూడా గుర్తించి కారణాలను అన్వేషిస్తున్నారు. షెడ్ల చుట్టూ వరి, పత్తి లాంటి పంటలు వేసి, వాటికి అధికంగా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తే ఆ మందుల ప్రభావంతో పట్టు పురుగులు గూళ్లు అల్లడం లేదని అధికారులు చెబుతున్నారు.

బాగా తగ్గిన ధర

గత ఏడాది పట్టుగూళ్ల ధర కిలో రూ.750 ఉండగా, ఇప్పుడు రూ.470కి పడిపోయింది. ఒక్కో రైతు పంటకు 250 నుంచి 300 వరకు పురుగులు పెంచుతారు. 250 పురుగులు పెంచే రైతుకు గతంలో 215 కిలోల దిగుబడి సాధించగా, ప్రస్తుతం 165కిలోలే వస్తోంది. ధర గతంలో కిలో రూ.750 చొప్పున 215 కిలోలకు రూ.1,61,250 వచ్చేవి. ప్రస్తుతం కిలో రూ.470 చొప్పున 165 కిలోలకు రూ.77,550 మాత్రమే వస్తోంది. సగానికిపైగా ఆదాయం తగ్గింది.

రైతులకు అందని బోనస్

పట్టు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కిలోకు రూ.75 చొప్పున బోనస్ ఇవ్వాల్సి ఉండగా, 2018 నుంచి వాటిని చెల్లించడం లేదు. ఒక్కో రైతుకు రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు బోనస్‌గా రావాల్సి ఉంది. దిగుబడి, ధర తగ్గడం, ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవడంతో కొందరు రైతులు మల్బరీ తోటలను తొలగిస్తుండగా, మరి కొందరు నష్టాలను చవిచూస్తూ అలానే కొనసాగిస్తున్నారు.

రూ.2.50లక్షల బోనస్ రావాలి



సుమారు దశాబ్దకాలానికి పైగా మల్బరీ సాగు చేస్తున్నా. ఐదారు మాసాలుగా దిగుబడి తగ్గింది. పట్టు గూళ్ల ధర కూడా పడిపోయింది. 2018 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల బోనస్ రావాలి. నూతన ప్రభుత్వమైనా మా సమస్యలు పరిష్కరించాలి.

బండ విజయ్‌రెడ్డి, పట్టు రైతు, పాటిమట్ల

100 రోజుల్లో అభయహస్తం అమలు చేస్తాం

● రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



షైలారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బొమ్మలరామారం: 100 రోజుల్లో అభయహస్తం పథకాలను అమలు చేస్తామని రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం బొమ్మలరామారం మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హాజీపూర్ గ్రామంలో రూ.6.31కోట్లతో నిర్మాణ పనులకు, షైలారం గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన పల్లె దవాఖాన నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, 100 రోజుల్లో అభయహస్తం గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. హాజీపూర్‌లో శ్రీనివాస్‌రెడ్డి చేతిలో హత్యకు గురైన బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని, వారి కుటుంబాలకు ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల వైపు ఉంటుందని, ఫిబ్రవరిలో గ్రూప్-2, డీఎస్సీ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేష్ చంద్ర, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

త్వరలో ఆటో కార్మికులను కొండపైకి అనుమతిస్తాం

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 24: త్వరలో ఆటో కార్మికులను యాదగిరిగుట్టపైకి అనుమతిస్తామని, ఇక్కడికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం యాదగిరిగుట్టలోని వైటీడీఏ అతిథి గృహంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండపైకి వచ్చే భక్తులకు ఎలాంటి సౌకర్యాలు లేవని, గత ప్రభుత్వం నిధులు కేటాయించి ఏమి అభివృద్ధి చేసిందని, సంబంధిత వైటీడీ అధికారులను ప్రశ్నించారు. త్వరలో కొండపైకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొండకింద ఫ్లై ఓవర్ అవసరం లేకున్నా నిర్మించి ఆటో కార్మికులు, స్థానిక వ్యాపారులకు తీవ్ర అన్యాయం చేశారని చెప్పారు. పట్టణంలో మంజూరైన కోర్టుకోసం దేవస్థానం భవనమైనా కేటాయించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగేను ఆదేశించారు. స్థానిక డిపోను మరింత అభివృద్ధిచేసి, అదనంగా 40 బస్సులను కేటాయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు పట్టణంలో పాతగుట్ట చౌరస్తా నుంచి స్థానిక సింహద్వారం వరకు కాలినడకన వెళ్లి ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. పాదాలవద్ద స్వామివారికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

స్వామి వారిని దర్శించుకున్న మంత్రి

కొండపైన లక్ష్మీనరసింహస్వామిని మంత్రి వెంకట్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. ప్రధానార్చకులు నల్లంథిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈవో రామకృష్ణారావు మంత్రికి స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్, రాష్ట్ర నాయకురాలు బండ్రు శోభారాణి, మాజీ ఉపసర్పంచ్ గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్, మంగ సత్యనారాయణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దకందుకూరులో అభివృద్ధి పనులు ప్రారంభం

మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో నిర్మించిన గ్రంథాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం తాళ్లగూడెం బ్రిడ్జిని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములుగౌడ్, మాజీ సర్పంచ్ మాధవి, తాళ్లగూడెం సర్పంచ్ ఈదులకంటి భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

అందరి గురి చైర్మన్ గిరీపైనే

● జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న 'అవిశ్వాస' రాజకీయాలు ● భువనగిరిలో ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

జిల్లాలో అవిశ్వాస రాజకీయాలు రసవత్తంగా మారాయి. ఓవైపు అధికార పీఠాలు దక్కించుకునే పనిలో పలువురు ప్రజాప్రతినిధులు నిమగ్నం కాగా, మరోవైపు ఆ పీఠాన్ని పదిలపరుచుకునే పనిలో చైర్మన్లు నానా తంటాలు పడుతున్నారు. అవిశ్వాస తీర్మానాల కోసం క్యాంపు రాజకీయాలు కొనసాగుతుండగా, వారిని కాపాడుకునే పనిలో చైర్మన్లు నిమగ్నమయ్యారు.

మోత్కూరు, జనవరి 24: మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిపై కౌన్సిల్ సభ్యులు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించేందుకు వచ్చేనెల 9న మునిసిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆదేశించినట్లు మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 9న ఉదయం 11 గంటలకు ప్రత్యేక మునిసిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లందరికీ సమావేశం ఎజెండా కాపీలు పంపామన్నారు. ఓటింగ్ నిర్వహించడానికి ఆర్డీవో అమరేందర్ ప్రిసైడింగ్ అధికారిగా ఉంటారన్నారు. మునిసిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు ఉండగా 9 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ సావిత్రిపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఈ నెల 20న కలెక్టర్‌కు తీర్మానం అందజేసిన విషయం తెలిసిందే. అవిశ్వాస తీర్మానం కాపీని కలెక్టర్‌కు అందజేసిన వెంటనే కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లారు. మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు 8 మంది, కాంగ్రెస్‌కు నలుగురు కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్ చైర్‌పర్సన్ సావిత్రిపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు సంతకాలు చేశారు. 9మంది కౌన్సిలర్లు క్యాంపులోనే ఉన్నారు. అవిశ్వాసం నెగ్గినా వెంటనే నూతన చైర్మన్ ఎన్నిక జరిగే అవకాశం లేదంటున్నారు.

కొత్త చైర్మన్ ఎన్నికకు ఎదురు చూపులే..

అవిశ్వాసం నెగ్గిన తర్వాత ఖాళీ అయిన స్థానాల్లో కొత్తవారిని ఎన్ని రోజుల్లో ఎన్నుకోవాలి, ఎన్నిక ఎలా నిర్వహించాలన్న దానిపై 2019 మునిసిపల్ చట్టంలో క్లారిటీ లేదని అధికారులు చెబుతున్నారు. అదే కొత్త చైర్మన్లను వెంటనే ఎన్నుకోక పోవడానికి కారణమంటున్నారు. ఇప్పటికే కొందరు మునిసిపాలిటీల చైర్‌పర్సన్‌లు అవిశ్వాస తీర్మానాలపై ఓటింగ్ నిర్వహించకుండా స్టే తెచ్చుకోవడానికి కోర్టుకు వెళ్లారంటున్నారు. వారి పిటిషన్లను సింగిల్ జడ్జి కొట్టివేయడంతో వారు తిరిగి డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేసుకోగా కోర్టు విచారణ జరుగుతోంది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. డివిజన్ బెంచ్ తీర్పు వెలువడితేనే అవిశ్వాసం నెగ్గిన చోట కొత్త చైర్మన్ల ఎన్నిక విషయమై స్పష్టత వస్తుందంటున్నారు.



భువనగిరి ఎంపీపీపై అవిశ్వాసం రద్దు చేయాలని ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

భువనగిరి రూరల్: భువనగిరి ఎంపీపీ నరాల నిర్మలపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం తీర్మానం రసవత్తరంగా మారింది. భువనగిరి మండల పరిషత్‌లో 13 మంది ఎంపీటీసీలు కొనసాగుతుండగా, ఎంపీపీ నిర్మలపై అవిశ్వాసం పెట్టాలని 10మంది సంతకాలు చేసి, తీర్మాన కాపీని ఈ నెల 20న ఆర్డీవో పి.అమరేందర్‌కు అందజేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌నుంచి కాంగ్రెస్‌లో చేరిన నిర్మలపై ఆమె వ్యవహార శైలి, ఏకపక్ష నిర్ణయాలతో విసిగామని ఇద్దరు కాంగ్రెస్ ఎంపీటీసీలు, బీఆర్ఎస్‌కు చెందిన వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డితోపాటు ఐదుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు, సీపీఎం ఎంపీటీసీ ఒకరు పార్టీలకతీతంగా ఏకమై ఎంపీపీని గద్దె దింపాలని కోరుతూ అవిశ్వాసం ప్రకటిస్తూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి జోక్యం చేసుకొని కాంగ్రెస్ ఎంపీటీసీలను బుజ్జగించడం, బీఆర్ఎస్‌కు చెందిన బొక్క కొండల్‌రెడ్డి, రాసాల మల్లేశ్‌లు తిరిగి ఎంపీపీ నిర్మలకు మద్దతు ప్రకటించడం, కాంగ్రెస్‌కు చెందిన పాశం శివానంద్, మట్ట పారిజాత నిర్మలకు మద్దతుగా నిలవడంతో అవిశ్వాస తీర్మానం రసవత్తరంగా మారింది. దీంతో బుధవారం ఎంపీపీ నిర్మలతోపాటు మరో ఆరుగురు ఎంపీటీసీలు అవిశ్వాసాన్ని రద్దు చేయాలని ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కాగా ఎత్తుకు పైఎత్తుగా వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మొత్తం ఆరుగురు ఎంపీటీసీలు కలెక్టరేట్ ఏవో జగన్‌కు వినతిపత్రం అందజేశారు.

అడ్డగూడూరు సొసైటీ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ

అడ్డగూడూరు: అడ్డగూడూరు సొసైటీ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లుపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ సహకార సంఘంలో మొత్తం 13మంది డైరెక్టర్లున్నారు. 2025 ఫిబ్రవరి 3వరకు సొసైటీ పాలకవర్గం పదవీకాలం ఉంది. 2020లో జరిగిన ఎన్నికల్లో మొత్తం ఆరుగురు బీఆర్ఎస్ మద్దతుదారులు గెలవగా, ఒక సీపీఐ అభ్యర్థి బీఆర్ఎస్‌కు మద్దతిచ్చారు. ఐదుగురు కాంగ్రెస్ మద్దతుదారులు, ఏడుగురు మద్దతుతో గెలుపొంది పొన్నాల వెంకటేశ్వర్లు సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఐదుగురు కాంగ్రెస్ డైరెక్టర్లతోపాటు బీఆర్ఎస్ డైరెక్టర్లు సైతం పొన్నాలపై అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ డైరెక్టర్లు ఏకమై పొన్నాలపై అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదుపుతున్నారు. ఇందుకోసం తొమ్మిది మంది డైరెక్టర్ల సంతకాలతో ఈ నెల 22న డీసీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై అవిశ్వాసం పెట్టేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జిల్లా సహకార అధికారి ఆధ్వర్యంలో వచ్చే నెల 12న ఉదయం 11గంటలకు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు డీసీవో తెలిపారు.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు

భువనగిరి టౌన్, జనవరి 24: బాలికలు చదువులో రాణిస్తూ సమాజంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఏ.జయరాజు అన్నారు. బుధవారం భువనగిరిలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నిరంతరం అప్రమత్తంగా ఉండేందుకు బాలికలు ప్రయత్నించాలన్నారు. ప్రలోభాలకు గురి కావొద్దని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి, అవసరాలకోసం మాత్రమే వినియోగించుకోవాన్నారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా బాలికలకు ఉపాధి, విద్య, అన్నిరంగాల్లో రాణించే అవకాశాలు మెరుగవుతున్నాయన్నారు. మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కే.మారుతీదేవి మాట్లాడుతూ బాలికలపై అకృత్యాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్న అంశమని, వీటి నియంత్రణకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. చైతన్యంతో బాలికలు సమస్యలను అధిగమించవచ్చునన్నారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరేలా అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిభాపాటవ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏ.దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, జిల్లా సంక్షేమ అధికారి అన్నపూర్ణ, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, డీఈవో డాక్టర్ కె.నారాయణరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య, రూరల్ ఎస్ఐ రామచందర్ పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు.

4.5కిలోల గంజాయి చాక్లెట్ల స్వాధీనం

ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న కూలీ ● 869 చాక్లెట్ల పట్టివేత

రైలులో తనిఖీల్లో గుర్తించిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

●8లో..

యాదగిరిక్షేత్రంలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు

నిత్యాదాయం రూ. 16.80లక్షలు

యాదగిరిగుట్ట, జనవరి 24: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు ఆగమశాస్త్ర రీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయంలో కొలువైన స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొపిన అర్చకులు పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిత్య తిరుకల్యాణం సంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామి ఆశీస్సులు అందజేశారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యపూజలు, యాగశాలలో నిత్యరుద్ర హవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. స్వామిని సుమారు 10వేలకు పైగా మంది భక్తులు దర్శించుకోగా, ఆలయ ఖజానాకు రూ.16,80,479 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

కుమారుడిని హత్యచేసిన తల్లికి జీవితఖైదు

● సహకరించిన ప్రియుడికీ శిక్ష

● తీర్పు చెప్పిన నల్లగొండ జిల్లా సెషన్స్ కోర్టు

నల్లగొండ టౌన్, జనవరి 24: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని కుమారుడిని హత్యచేసిన తల్లికి, అందుకు సహకరించిన ప్రియుడికీ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా సెషన్స్ కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను రూరల్ ఎస్ఐ కంచర్ల భాస్కరరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం బుద్దారం గ్రామానికి చెందిన పలేటి విజయ, వెంకన్న దంపతులకు ఇద్దరు కుమారులు అఖిల్, నాగరాజు ఉన్నారు. విజయ అదే గ్రామానికి చెందిన తోకల వెంకట్‌రెడ్డితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని చిన్న కుమారుడు నాగరాజు(9 సంవత్సరాలు) గమనించి తండ్రికి చెబుతానన్నాడు. దీంతో ఆగ్రహించిన విజయ, వెంకట్‌రెడ్డి 2020 ఫిబ్రవరి 21వ తేదీన బాలుడిని ఇంట్లోనే టవల్‌తో గొంతు నులిమి చంపేశారు. అయితే బాలుడి మెడపై నల్లటి మచ్చలు ఉండడాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అప్పటి సీఐ ఎస్‌కె. మహబూబ్‌పాష కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 90 రోజుల అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన విజయను భర్త అంగీకరించకపోవటంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. వెంకటరెడ్డి గ్రామంలోనే ఉంటున్నాడు. ఈ కేసుకు సంబంధించి సాక్షులను విచారించిన జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం. నాగరాజు నిందితులిద్దరికీ యావజ్జీవ కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు బుధవారం చెప్పారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
ఆట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్‌వి నోము - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్య - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్ - అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కోరినట్టు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావోస్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమొచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన ఆడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత ఆడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.

అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి



వలిగొండ: నాతాళ్లగూడెంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ/ మోత్కూరు, జనవరి 24: ప్రణాళికా బద్ధంగా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్ అన్నారు. బుధవారం వలిగొండ, మోత్కూరు మండలాల్లో పలు అభివృద్ధి కార్యమాల్లో వారు వేర్వేరుగా పాల్గొన్నారు. వలిగొండ మండలంలోని నాతాళ్లగూడెంలో కమ్యూనిటీ హాల్, జాలు కాలువలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలిగొండ మండల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పలు గ్రామాల్లో ఉన్న మట్టి రోడ్లను మెటల్ రోడ్లుగా మార్చనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్య ప్రజాపాలన సాగిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీని రూ.10లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను తప్పనిసరిగా అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లబ్ధిదారులకు గతం కంటే అధిక మొత్తం లబ్ధి చేకూరుస్తుందని తెలిపారు. ప్రజలు మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. మెరుగైన వైద్య సేవల కోసం నిమ్స్ ఆసుపత్రి సేవలు పొందాలన్నారు. బునాదిగాని కాల్వ, ధర్మారెడ్డిపల్లి కాల్వల పనుల పూర్తి చేసి, మూసీ నదిపై శిథిలావస్థలకు చేరిన వంతెనలను అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పొద్దుటూరు నుంచి మండల కేంద్రానికి నూతన రహదారులను నిర్మిస్తామని, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. అనంతరం ధర్మారెడ్డిపల్లి కాల్వను పరిశీలించారు. రైతులకు నీరు అందించి ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్‌రాజు, జడ్పీటీసీ వాకిటి పద్మ అనంతరెడ్డి, వైస్ఎంపీపీ బాతరాజు ఉమాబాలనర్సింహ, సర్పంచ్ ఉలిపె మల్లేశ్, మద్దెల సందీప్‌కుమార్, ఎంపీటీసీ నర్సింహ, ఉపసర్పంచ్‌లు పార్వతమ్మ, సువర్ణ, పీఆర్‌డీఈ శ్రీనివాసులు, ఏఈ సుగుణాకర్‌రావు, ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, నాయకులు సత్తిరెడ్డి, కిష్టయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనానికి రూ.కోటి నిధులు : ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్: జిల్లా కేంద్రం భువనగిరిలో నిధుల లేమితో అర్థాంతరంగా నిలిచిన అంబేద్కర్ భవన పనుల పూర్తికి రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన అంబేద్కర్ భవన్‌ను పరిశీలించి మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.60లక్షలు, ఎమ్మెల్యే నిధుల నుంచి తాను రూ.40లక్షలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. మిగులు పనులను పూర్తి చేసి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14లోపు వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ భవనాన్ని స్ఫూర్తి భవనంగా తీర్చిదిద్దామన్నారు. రూ.60లక్షలు కేటాయించిన మంత్రి కోమటిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షులు కూర వెంకటేష్, తంగెళ్లపల్లి రవికుమార్, నాయకులు భట్టు రాంచంద్రయ్య, బర్రె సుదర్శన్, దర్గాయి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

సామేల్ శంకుస్థాపన చేసి మాట్లాడారు. రోడ్డులో ఎత్తు, పల్లాలు లేకుండా, పనులను నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో ఉన్న నిధులను అన్ని గ్రామాలకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి, ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ డీఈఈ షహనాబి, ఏఈలు శ్రీనివాస్, స్వామి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

మోత్కూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మోత్కూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి రాజన్నగూడెం శివారు వరకు రూ.5.80కోట్లతో మంజూరైన డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి, మండల పరిషత్ కార్యాలయం గేటు నుంచి ప్రస్తుత పంచాయతీరాజ్ డీఈ కార్యాలయం వరకు సీసీ చేసే పనులకు ఎమ్మెల్యే

బాధిత కుటుంబాలకు పరామర్శ

అడ్డగూడూరు: మండలంలోని ధర్మారం, చిర్రగూడూరు గ్రామాలకు చెందిన కప్పల చామంతి (30), చౌగోని శేఖర్ (25) హైదరాబాదులో మంగళవారం సాయంత్రం ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడగా వారి మృతదేహాలను ఆయా గ్రామాలకు బుధవారం తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మందుల సామేలు ధర్మారంలో చామంతి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇదే గ్రామానికి చెందిన కన్నెబోయిన లింగయ్య మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి మృతి చెందడంతో లింగయ్య భౌతిక కాయంపై పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పలు కుటుంబాలను పరామర్శించారు.



మోత్కూరులో డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

4.500కిలోల గంజాయి చాక్లెట్ల స్వాధీనం

● ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న కూలీ



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

భువనగిరి టౌన్, జనవరి 24: హైదరాబాద్‌లో విక్రయించేందుకు రైలులో తరలిస్తున్న 869 గంజాయి చాక్లెట్లను ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ బృందం ఆలేరు రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా కు చెందిన తపన్‌కుమార్ పరిడ హైదరాబాద్ పటాన్‌చెరులోని ఓ ఫార్మాస్యూటికల్ కంపెనీలో మూడేళ్లుగా కూలీగా పని చేస్తున్నాడు. కోల్‌కతా నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు మంగళవారం ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరాడు. ఈ క్రమంలో రైలులో ప్రయాణిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రయాణికులను తనిఖీ చేశారు. సంచితో ఉన్న తపన్‌కుమార్‌పై అనుమానం వచ్చి సోదా చేయగా, అందులో 4.500కిలోల రూ.90వేల విలువైన 869 గంజాయి చాక్లెట్లను గుర్తించారు. వెంటనే అదుపులోకి తీసుకుని విచారించగా, ఒడిశాలో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడి కూలీలకు విక్రయించేందుకు తీసుకువెళుతున్నట్లు అంగీకరించాడు. స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లను, నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, భువనగిరి జైలుకు తరలించారు. గంజాయి చాక్లెట్ల రవాణా, విక్రయాలపై పూర్తి నిఘా పెట్టినట్లు, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి బి.రాధాకృష్ణ, భువనగిరి ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. దాడులు చేసిన వారిలో ఎక్సైజ్ ఎస్ఐలు పి. సాయికిరణ్‌రెడ్డి, జి నాగరాజు, జె. వివేక్ తదితరులు ఉన్నారు.

కట్టడాలను త్వరితగతిన పూర్తి చేయించాలి

భువనగిరి రూరల్, జనవరి 24: జిల్లా పరిషత్ నిధుల నుంచి మం జూరైన అభివృద్ధి కట్టడా ల పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ కార్యాలయ సమావేశపు హాల్‌లో జడ్పీ సీఈవో చలమల కృష్ణారెడ్డితో కలిసి ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులతో ఇప్పటి వరకు ప్రారంభమైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. మండలాల వారీగా నిధుల వినియోగం, పనుల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మోత్కూరు, జనవరి 24: పదో తరగతి విద్యార్థులు దాతలు అందిస్తున్న స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని, పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సూరోజు భాస్కరాచారి, ఆయన సతీమణి రిటైర్డు సీడీపీవో యాదమ్మ అందించిన స్టడీ మెటీయల్‌ను బుధవారం మండలంలోని బుజిలాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. పాఠశాలలో గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించే ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేయడానికి ఆ పాఠశాల పూర్వ విద్యార్థిని చాతరాశి మాధవి రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా డైరెక్టర్ ఎస్ఎన్‌చారి, మాజీ సర్పంచ్ చాతరాశి అంజయ్య, హెచ్ఎం టి.రవి, మత్స్యగిరి పాల్గొన్నారు.

రాచకొండను టెంపుల్‌సిటీగా అభివృద్ధి చేయాలి



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంస్థాన్‌నారాయణపురం, జనవరి 24: ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న రాచకొండ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా, టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలని మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అన్యాక్రాంతం అవుతున్న రాచకొండ భూములను పరిరక్షించాలని, మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరింత పటిష్టపరచాలని, ఎక్స్‌ప్రెస్ బస్సులను దిల్‌సుఖ్‌నగర్ నుంచి నారాయణపురం, గట్టుప్పల్, మునుగోడు వరకు నడిపించాలని, రాచకొండలో ఫారెస్టు రెవెన్యూ సమస్యను పరిష్కరించి, రైతులకు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయకులు మందుగుల బాలకృష్ణ, ఏపూరి సతీష్, వాంకుడోత్ బుజ్జి, కొన్‌రెడ్డి నరసింహ, రమేష్‌బాబు, రమేష్‌నాయక్, ప్రవీణ్‌రెడ్డి, రాంనాయక్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

మల్లికార్జునుడి సేవలో ఎమ్మెల్యే వీరేశం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం, కాంగ్రెస్ నాయకులు

రామన్నపేట, జనవరి 24: పట్టణంలోని భ్రమరాంభమల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోదాసు శిరీషపృథ్విరాజ్, గంగుల రాజిరెడ్డి, పున్న జగన్, గుత్తా నర్సిరెడ్డి, జెల్ల వెంకటేష్, వనం చంద్రశేఖర్, ఎండి అక్రం, రామిని రమేష్, కోట సుధాకర్, సాల్వేరు లింగం పాల్గొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో విలసిల్లాలని భ్రమరాంబామల్లికార్జునుడిని వేడుకున్నట్లు తెలిపారు. కాగా స్వామి కల్యాణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట పోచబోయిన మల్లేశం, బందాల రాములు, వేమవరపు సుధీర్ బాబు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలి

రామన్నపేట, జనవరి 24: బాలికలు విద్య, ఉపాధి, వైద్యం, క్రీడలు, అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన పిలుపునిచ్చారు. బాలికల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలకు మహిళలకు బాల్య వివాహ వ్యతిరేక చట్టాలు, గర్భనిర్ధారణ వ్యతిరేక చట్టాలు, ర్యాగింగ్, ప్రేమ వివాహాలపై అప్రమత్తంగా ఉండి తమ లక్ష్యం ఉన్నత చదువుల ఉన్నతమైన ఉద్యోగాల సాధనకోసం తమ దృష్టి మళ్లించాలని అన్నారు. బాలికలు సమాజ స్థితిగతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సదస్సులో న్యాయవాది మామిడి వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, దంతూరి సత్తయ్య, సాయి పాల్గొన్నారు.

ఆరోగ్య విషయాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

చౌటుప్పల్ టౌన్, జనవరి 24: బాలికలు చదువుతో పాటు ఆరోగ్య విషయాలపై తగు జాగ్రత్తలను తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో బాగంగా బుధవారం చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల అండ్ కళాశాలలో ఆరోగ్య విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ కె.అలివేలు, వైద్య, ఆరోగ్య శాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారులు వసంత, ఏక్తారాణి, మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ, భార్గవి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: డీటీవో



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీటీవో రవీందర్

భువనగిరి రూరల్, జనవరి 24: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణ శాఖ అధికారి గంటా రవీందర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని అనాజీపురం శివారులో గల దివ్యబాల హైస్కూల్‌లో బుధవారం ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలపై ప్రయాణం చేయవద్దని, 18 సంవత్సరాలు లోపు ఉన్న పిల్లలకు వాహనాలను ఇవ్వరాదని, రోడ్డు నిబంధనలు పాటించని వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికృష్ణ పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

భువనగిరి టౌన్, జనవరి 24: రైతుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్నాల వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్, మార్కెటింగ్, రెవెన్యూ, వ్యవసాయ తదితర ప్రభుత్వ శాఖల నుంచి రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ మేరకు త్వరలో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోక్ల యాదగిరి, కాటం ఐలేష్, బొరంపేట మల్లారెడ్డి, సాధినేని రవీందర్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఇగ్లీష్ ప్రాక్టికల్స్



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ నోడల్ అధికారి రమణి

భువనగిరి టౌన్, జనవరి 24: ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ అమల్లోకి వచ్చినట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సి.రమణి తెలిపారు. బుధవారం భువనగిరిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆగ్లంపై పిల్లల్లో ఉన్న భయాందళనలను లెక్చరర్స్ నివారించాలన్నారు. ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇంగ్లీష్ లెక్చరర్స్ పాల్గొన్నారు.

బస్వాపురం కాల్వలో అస్థిపంజరం కలకలం

భువనగిరి రూరల్, జనవరి 24: మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారు బస్వాపురం ఫీడర్ చానెల్(కాల్వ)లో వ్యక్తి అస్తిపంజరం కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల వివరాల ప్రకారం.. బస్వాపురం ఫీడర్ చానెల్(కాల్వ)లో అస్థిపంజరం ఉందని బుధవారం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై బ్లూకలర్ జీన్‌పాయింట్, మెరూన్ కలర్ టీషర్ట్ ఉంది. 35సంవత్సరాల వయస్సు గల పురుషుడిని వారం రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి నాగిరెడ్డిపల్లి శివారులోని కాల్వలో ఆనవాళ్లు దొరకకుండా మృతదేహాన్ని కాల్చివేసినట్లు భావిస్తున్నామని రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ ఎస్.వెంకట్‌రెడ్డి పట్టణ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కృష్ణ పరిశీలించారు. స్థానిక డాక్టర్‌ను పిలిపించి అస్తిపం జరానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఆనవాళ్లకు సంబంధించి క్లూస్‌టీం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కొన్ని ఎముకలు డీఎన్ఏ పరీక్ష చేపట్టి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు తరలించారు. అస్థిపంజరాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మార్చురీలో భద్రపర్చారు. ఇటీవల అదృశ్యమైన వ్యక్తుల వివరాలను సేకరిస్తూ పరిసర పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలి



కలెక్టరేట్‌లో డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే తదితరులు

భువనగిరి అర్బన్, జనవరి 24: ప్రజలకు పారదర్శకతతో కూడిన ఉత్తమమైన సేవలు అందించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు వింటేనే ప్రజల్లో సగం ఆందోళన తగ్గిపోతుందని, క్రమ శిక్షణగా ప్రతీ ఉద్యోగి తన విధ్యుక్త ధర్మం నిర్వర్తించాలన్నారు. ఆత్మీయంగా ప్రజలను పలకరిస్తే వారు రెట్టింపు ఆదరణ చూపుతారని అన్నారు. జిల్లాకు మంచి పేరు, గుర్తింపు తీసుకువచ్చేందుకు అధికారుల కృషి ఉండాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అర్హులైన లబ్దిదారులకు అన్యాయం జరగకుండా అధికారులు కర్తవ్యోన్ముఖులై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కులను గుర్తెరిగి సమన్వయంతో పని చేస్తూ జిల్లాను అగ్రస్థానంలో నిలింపేందుకు దృఢసంకల్పంతో విధులు నిర్వహించాలన్నారు. శాసన సభ ఎన్నికల నిర్వాహణ స్ఫూర్తితో లోకసభ ఎన్నికల నిర్వాహణ అదేవిధంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీవో పి.అమరేందర్, జిల్లా ఖజానా శాఖ అధికారి సురేష్, గజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో జగన్, ట్రెసా అర్గనైజింగ్ సెక్రటరీ దేశ్యానాయక్, నాన్ గజిటెడ్ సంఘం అధ్యక్షుడు భగత్, రెవిన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కే. శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఎండీ ఖదీర్, అర్గనైజింగ్ సెక్రటరీ శైలజ, నల్లగొండ నాన్ గజిటెడ్ సంఘం కార్యదర్శి కే. కిరణ్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


పెండింగ్ బిల్లులు ఇప్పించాలి

● సర్వసభ్య సమావేశంలో అధికారులను కోరిన సర్పంచులు



సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు, ఎంపీటీసీ సభ్యులు

ఆత్మకూరు(ఎం), జనవరి 24: ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామాల్లో చేసిన సంక్షేమ పనులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ఇప్పించాలని సర్వసభ్య సమావేశంలో సర్పంచులు అధికారులను కోరారు. బుధవారం ఎంపీపీ తండ మంగమ్మ అధ్యక్షతన జరిగిన చివరి సమావేశంలో పలువురు సర్పంచులు మాట్లాడుతూ తమ పదవీ కాలం ఈ నెలతో ముగుస్తుందని, తాము గ్రామాల్లో చేపట్టిన పనులకు లక్షల కొద్ది బిల్లులు రావాల్సి ఉందని, త్వరగతిన ఇప్పించాలని అధికారులను కోరారు. చేసిన పనులకు రావాల్సిన బిల్లుల వివరాలను ఆ సర్పంచుల లెటర్ ప్యాడ్స్‌పై రాసి ఇవ్వాలని, పై అధికారులకు పంపిస్తామని, సర్పంచులు ఎవరూ అధైర్యపడొద్దని ఎంపీవో పద్మావతి కోరారు. మహిళా సంఘాల్లో మహిళలకు బ్యాంక్ రుణాలు ఇప్పించినందుకు వీవోకేలు పర్సంటేజీలు ఎందుకు తీసుకుంటున్నారు అని ఎంపీటీసీ వై.కవిత ఏపీఎం పక్కీరయ్యను ప్రశ్నించారు. ఆ విషయం తన దృష్టికి రాలేదని ఏపీఎం సమాధానం చెప్పారు. ఎంపీపీ తండ మంగమ్మ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల తోపాటు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కాగా గ్రామాల పాలన ఐదేళ్లు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని మండల సర్పంచులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన చివరి సర్వసభ్య సమావేశంలో కార్యాలయం సిబ్బంది ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ తండ మంగమ్మ ఎంపీడీవో నిరంజన్ లు సర్పంచులకు శాలువాలు కప్పి మెమెంటో అందజేసి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు మాట్లాడుతూ ఈ నెలతో మాపదవీ కాలం పూర్తి అవుతున్నప్పటికీ తమకు ఎలాంటి బాధ లేదన్నారు. చేసిన పనులకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఐదేళ్ల పాటు సహకరించిన మండల అధికారులకు సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ, వైస్ ఎంపీపీ బి.పద్మ, ఎంపీడీవో నిరంజన్, డీటీ సఫియొద్దీన్, ఎంపీవో పద్మావతీ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



తుర్కపల్లి: మాజీ ఎంపీటీసీ నూనావ తు ఉమ్లానాయక్ తన సొంతనిధులతో తాగు ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టారు. తుర్కపల్లి మండలం ముల్కలపల్లి పంచాయతీ పరిధిలోని బోజ్యతండలో ప్రజల కోరిక మేరకు బోరు వేయించారు.

చౌటుప్పల్ టౌన్ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుబి మోగించడం ఖాయమని ఆ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ అన్నారు. యువజన కాంగ్రెస్ డోర్ టు డోర్ ప్రచారంలో నిలిచిన టాప్ టెన్ లోని మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దగోని రమేష్ గౌడ్ ను బుధవారం హైదరాబాద్ లోని గాంధీ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దీపా మున్షీ దాస్ సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

భువనగిరి టౌన్: అర్హులైన యువత ఓటరుగా నమోదు అయ్యేలా బీజేవైఎం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు జోనల్ ఇన్‌చార్జి పట్నం కపిల్ తెలిపారు. భువనగిరి జరిగిన బీజేవైఎం సమావేశంలో మాట్లాడారు.

మోత్కూరు : తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్‌ను మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి ఆవిష్కరించారు.

చౌటుప్పల్ టౌన్ : మునిసిపాలిటీలోని లక్కారం ఫీడర్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో ఈ నెల 25న మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న ట్రాన్స్ ఏఈ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా హనుమాన్‌నగర్, సుందరయ్య కాలనీ, ఎంపీడీవో ఆఫీస్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

భువనగిరి టౌన్ : పరీక్షాపే చర్చ -2024, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని భువనగిరిలో ఇంటర్ స్కూల్ చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనంతో పిల్లల్లో సృజనాత్మకత, సొంత భావాలను వెల్లడించే అవకాశాలు లభిస్తాయని కేంద్రీయ విద్యాలయం ఆర్ట్ టీచర్ కె.హేమంత్‌కుమార్, నిష్ట్ ఫ్యాకల్టీ శ్వేతచంద్ర అన్నారు.

భువనగిరి టౌన్ : భువనగిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కళాశాల ఆవరణలో సభా వేదిక, స్టాల్స్, గ్యాలరీలు, శకటాల ప్రదర్శన, పార్కింగ్, తదితర ఏర్పాట్లను ముమ్మరం చేశారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరం అయితే ఏర్పాట్లన్ని పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంత్ కె.జండగే ఆదేశించారు.

మోత్కూరు : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు డిమాండ్ చేశారు. మోత్కూరులో యూటీఎఫ్ మహాసభలో ఆయన మాట్లాడారు.

మోత్కూరు : మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన బోడ బాబూరావును మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ మేరకు హసేన్ బాబూరావుకు నియామక పత్రాన్ని అందజేశారు.


మోత్కూరు : వేమన జయంతి ఉత్సవాల నేపథ్యంలో జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని బుజిలాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వేమన పద్య పోటీలు నిర్వహించారు. మధుప్రియ (పదో తరగతి) ప్రథమ, చిత్ర (9వ తరగతి) ద్వితీయ, ధనుంజయ్ (8వ తరగతి) తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

మోటకొండూర్ : బరువు తక్కువ ఉన్న విద్యార్థులు పౌష్టిక ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి విజయ్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థులకు ఎనీమియా వైద్య పరిక్షలు న్విహించారు. వంద మంది విద్యర్థులకు వైద్యా పరీక్షలు నిర్వహించగా 16 మందికి ఎనిమియా ఉన్నట్లు గుర్తించి చికిత్సను అందించారు.

రాజాపేట: మండలం సోమారం గ్రామంలో వీధి కుక్కల దాడిలో 8 గొర్రెలు మృతి చెందగా రూ.1లక్ష నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన ఉప్పాల బాల నర్సయ్యకు చెందిన గొర్రెల మందపై మంగళవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. రూ.1లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

చౌటుప్పల్ రూరల్ : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. 40 క్వింటాళ్ళ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పాత సమాచారం



కొత్త ప్రభుత్వం కొలువుదీరి 45 రోజులు దాటినా జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది దినసరి వివరాలు తెలిపే పట్టిక మారలేదు. 2022సంవత్సరంలో నమోదు చేసిన వివరాల్లో ఎలాంటి మార్పులు చేర్పులు చేయలేదు. వైద్యం కోసం ఇక్కడకు వచ్చే రోగులు ఎవరిని కలవాలి? ఏ నంబరుకు ఫోన్ చేయాలో? తెలియని గందరగోళం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం మారినా కనీసం సీఎం ఫొటోతో పాటు పట్టికను కూడా మార్చలేదని పలువురు చర్చించుకుంటున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్ యాదాద్రి, ఆంధ్రజ్యోతి